నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

పగలురేయి కలిసి పరిపూర్ణ దినమండ్రు
ప్రకృతిచక్రమందు వరుసజాడ
కష్టసుఖములున్న కలిసి సంపూర్ణంబు
మనిషిజీవితమున మహిమనిదియె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 40 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 17-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

## రైతు వేదికల వద్ద అందుబాటులోకి తేవాలి

- సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి
- వ్యవసాయంలో ఏఐ , టెక్నాలజీ వినియోగం పెరగాలి
- అగ్రికల్చర్ యూనివర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం
- సీడ్స్ నుంచి కొనుగోలు వరకు శాఖల సమన్వయం
- సబ్సిడీపై 7 రకాల సన్నవడ్ల పంపిణీ
- వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ సూచన

హైదరాబాద్,

ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు.

-మిగతా 2 లో





## జూన్ 22 వరకు టెలిగ్రాం యాప్ బ్లాక్

- నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం
- జూన్ 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్ నిలిపివేత
- పేపర్ లీకేజీలను అరికట్టేందుకే కఠిన ఆంక్షలు
- తక్షణమే అమల్లోకి వచ్చిన టెలిగ్రామ్ నిషేధం
- ఎన్టీఏ మార్గదర్శకాలతో రంగంలోకి ప్రభుత్వం
- చీటింగ్ ముఠాల గుట్టురట్టు చేసేందుకే ఈ చర్యలు
- అభ్యర్థులను టార్గెట్ చేస్తున్న గ్రూపులపై నిఘ

న్యూఢిల్లీ

కేంద్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రాం యాప్‌ను ఇండియా బ్లాక్ చేసింది. జూన్ 22వ తేదీ వరకు టెలిగ్రాం యాప్ అందుబాటులో ఉండదు. జూన్ 21వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ రీ-ఎగ్జామ్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక జూన్ 30వ తేదీ వరకు టెలిగ్రాం యాప్‌లో ఉన్న మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా ప్రభుత్వం డిజేబుల్ చేసింది. ఎగ్జామ్ మెటీరియల్‌ను లీకేజీ చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ చర్యలకు చేపట్టింది. మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌కు చెందిన యాప్‌ను తక్షణమే బ్లాక్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇచ్చిన

-మిగతా 2 లో



## సర్వే పై అప్రమత్తంగా ఉండాలి

- ఈ నాలుగు వారాలు అత్యంత కీలకం
- నియోజకవర్గ కోఆర్డినేటర్లు రోజు సమీక్ష చేయాలి
- వైసీపీ శ్రేణులకు వైఎస్ జగన్ దిశానిర్దేశం
- అధికార దుర్వినియోగంతో వైసీపీ ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ

ఏపీ బ్యూరో:

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్వే)పై నియోజకవర్గాల్లోని కో-ఆర్డినేటర్లు, రీజినల్ ఇన్చార్జిలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశించారు. సర్వే ప్రక్రియ జరుగుతున్న తీరుపై ప్రతిరోజూ సమీక్ష చేయాలని, ఎక్కడైనా తప్పులు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని, అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకు రావాలన్నారు. వచ్చే నాలుగు వారాలు అత్యంత కీలకమని, సర్వే విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వద్దన్నారు. సర్వే ప్రక్రియలో ఒక్కసారి ఓటు తొలగించిన తర్వాత దాన్ని తిరిగి చేర్చాలంటే అత్యంత కష్టమవుతుందన్నారు.

-మిగతా 2 లో



## హర్మ్యూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

- నౌకలు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతి
- శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుంది
- ఇరాన్‌పై కుదిరిన ఒప్పందాన్ని త్వరలో వెల్లడిస్తా
- జి 7 సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన

ప్యారిస్

ఫ్రాన్స్‌లో జీ 7 సదస్సు వేదికగా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హార్ముజ్ శాశ్వతంగా టోల్ రహితంగా ఉంటుందని వెల్లడించారు. సమ్మిట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం చేశారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుందని.. ఇకపై అది శాశ్వతంగా టోల్ ఫ్రీగా అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. అలాగే ఇరాన్‌తో కుదిరిన

-మిగతా 2 లో

## రాహుల్ కి నిజాయితీ లేదు

- రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలనే బలహీనపరుస్తున్నారు
- ఇండియా బ్లాక్‌లో పెరుగుతున్న అసంతృప్తికి కాంగ్రెస్సే కారణం
- పార్లమెంటు ఎన్నికల్లో మద్దతు కోరి.. రాష్ట్రాల్లో వెన్నుపోటు
- ఫలితాల అనంతరం డీఎంకేకు చెప్పకుండా టీవీకే వైపు..
- హస్తం పార్టీ ప్లేటు ఫిరాయింపుపై తమిళనాడు అధికార పక్షం ఆగ్రహం
- కాంగ్రెస్ పార్టీతో ఇక ఎప్పటికీ పొత్తు పెట్టుకోం: డీఎంకే స్పష్టీకరణ

చెన్నై

ద్రవిడ మున్నేత్ర కజగం (డిఎంకె) లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల గురించి.. కాంగ్రెస్ వ్యవహరించిన తీరుపైన డిఎంకె ఆరోపించింది. రాజకీయ పరిణతి, పారదర్శకత లేకపోవడమే ఇండియా బ్లాక్‌లో పెరుగుతున్న అసంతృప్తికి కారణమని డిఎంకె పత్రిక 'మురసోలి' ఎండగట్టింది. జాతీయ పార్లమెంటు

-మిగతా 2 లో



## జూలై మూడో వారంలో తల్లికి వందనం!

- ప్రభుత్వ పాఠశాల్లో ప్రవేశాల పెంపునకు ప్రత్యేక చర్యలు
- జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమ నిర్వహణ
- సీట్లను సకాలంలో నిర్వహించండి
- రాష్ట్రానికి ఎన్సీసీ స్టేట్ యూనిట్ మంజూరు
- విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



అమరావతి

ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం త్వరితగతిన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం, బడి పిలుస్తోంది, షైనింగ్ స్టార్స్, మెగా పీటీఎం, యోగాంధ్ర, టెట్ నిర్వహణ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ప్రభుత్వ

-మిగతా 2 లో

## అమెరికాలో కూలిన బీ-52 బాంబర్ విమానం..

- 8 మంది సిబ్బంది మృ
- టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే మోజావే ఎడారిలో ఘోర ప్రమాదం
- ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో పరీక్షల సమయం లోనే విషాదం
- రాడార్ ఆధునీకరణ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న బాంబర్ విమానం
- ఫ్లైట్ కంట్రోల్ లోపమే కారణమా?.. దర్యాప్తుకు ఆరు నెలల సమయం



లాస్ ఏంజిల్స్:

అమెరికాలో బీ-52 బాంబర్ విమానం కూలింది. ఈ ఘటనలో 8 మంది సిబ్బంది మృతిచెందారు. దక్షిణ కాలిఫోర్నియాలోని మోజావే ఎడారిలో ఉన్న ఎయిర్ ఫోర్స్ బేస్‌లో ఈ ప్రమాదం సంభవించింది. టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకే ఆ బాంబర్ విమానం నేలరాలింది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 11.20 నిమిషాలకు ఈ ప్రమాదం జరిగింది. ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో రొటీన్‌గా పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. లాస్ ఏంజిల్స్ నగరానికి ఉత్తరం దిక్కున ఈ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఉన్నది.బీ-52

-మిగతా 2 లో

## బీజేపీకి లబ్ధి చేకూర్చేలా 'సార్' ప్రక్రియ

### కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి తోత్తుగా మారింది

- పశ్చిమ బెంగాల్‌లో 92 లక్షల ఓట్ల అక్రమ తొలగింపు
- బీఎల్‌ఏలు కీలకంగా పనిచేస్తేనే ఓట్లకు రక్షణ
- కమలం పార్టీ ఆడించినట్లే ఆడుతున్న పవన్ కల్యాణ్
- మోదీ, అమిత్ షాల కంటే పెద్ద చక్రవర్తులే కాలగర్భంలో కలిసిపోయారు
- 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో కిషన్ రెడ్డి చిట్టా ఇవ్వాలి
- మూసీ ప్రక్షాళనకు నిధులు ఇవ్వకుండా కేంద్రం అరాచకం
- బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో పిసిసి చీఫ్ విమర్శలు



సంగారెడ్డి, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

కేవలం బిజెపికి లాభం చేకూర్చేలా సర్ ప్రక్రియ సాగుతోందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. ఈ పక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని ,

-మిగతా 2 లో

## పారదర్శకంగా యూరియా పంపిణీ

- ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్
- ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ధి
- క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కామారెడ్డి జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

:రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు



అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు

-మిగతా 2 లో



## ద్రోణి ప్రభావంతో రాష్ట్రావ్యాప్తంగా వర్షాలు

- బుధవారం పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వానలు
- కొన్నిచోట్ల వర్షం.. మరికొన్ని చోట్ల భానుడి ప్రతాపం
- విజయనగరం నుంచి తిరుపతి వరకు మోస్తరు వర్ష సూచన

అమరావతి

తూర్పు విదర్భ, తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో బుధవారం కొన్నిచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు, కొన్నిచోట్ల ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి

-మిగతా 2 లో

### జూన్ 22 వరకు టెలిగ్రాం

# యాప్ బ్లాక్

మొదటి తరువాయి

మార్గదర్శకాల ఆధారంగా ఈ చర్య చేపట్టారు. కేవలం ఎగ్జామినేషన్ పీరియడ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ యాప్‌ను రద్దు చేశారు. పేపర్ లీక్ ఘటనలను తగ్గిచేందుకు ఎడిటింగ్ ఫీచర్లను డిజైబుల్ చేశారు. గతంలో పోస్టు చేసిన మెసేజ్‌లను ఎడిట్ చేసి ఆప్షన్ ప్రస్తుతం 30వ తేదీ వరకు బ్లాక్ చేశారు. పేపర్ లీకేజీలకు పాల్పడుతున్న చీటింగ్ ముఠాలు టెలిగ్రాం యాప్‌ను విరివిగా వాడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. నీట్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులను ఆ చీటింగ్ ముఠా టార్గెట్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. పేపర్ లీకేలకు చెందిన అనేక ఛానళ్లను, గ్రూపులను ఇప్పటికే ప్రభుత్వం తొలగించింది.

# హర్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

మొదటి తరువాయి

అవగాహన ఒప్పందం పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తానని.. దీనిపై ప్రత్యేకంగా మీడియా సమావేశం కూడా నిర్వహిస్తానని తెలిపారు.

ఇరాన్‌తో కుదిరిన ఈ ఒప్పందాన్ని అమెరికా కాంగ్రెస్ పరిశీలనకు పంపనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ ఒప్పందంలో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోదని స్పష్టంగా పేర్కొన్నామని వెల్లడించారు. ఇరాన్‌తో చర్చల తొలి దశ విజయవంతంగా పూర్తైందని.. రెండో దశ చర్చలు మరింత వేగంగా పూర్తవు తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన పూర్తి పాఠ్యాన్ని అధికారిక కార్యక్రమంలో విడుదల చేస్తానని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన శాంతి ఒప్పందం ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ముఖ్యంగా హార్మూజ్ జలసంధి పునఃప్రారంభం ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఊరటనివ్వనుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాతో ఒప్పందం అనంతరం ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు మళ్లీ సముద్ర మార్గంలో ప్రయాణాలు ప్రారంభించాయని వెల్లడించింది. అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనం సడలింపుకు ఇది సంకేతమని పేర్కొంది. ప్రస్తుతం మూడు ఇరానియన్ చమురు ట్యాంకర్లు ఉత్తర హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా.. మరో రెండు నౌకలు అవసరమైన సరుకులు, పశువుల మేతతో దక్షిణ ఇరాన్ నౌకాశ్రయాల వైపు వెళ్తున్నాయని ఇరాన్ మీడియా తెలిపింది. ఏప్రిల్ 13 నుంచి అమల్లో ఉన్న అమెరికా నౌకాదళ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే తాజా ఒప్పందంతో ఆ దిగ్బంధనాన్ని ఎత్తివేసే పక్రియ అమలులోకి వచ్చిందని ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామం ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రాహుల్‌కి నిజాయితీ లేదు

మొదటి తరువాయి



ఎన్నికల సమయంలో తమ మిత్రపక్షాల మద్దతును కోరే కాంగ్రెస్, రాష్ట్ర స్థాయి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం తరచుగా వాటిని బలహీనపరిచేలా వ్యవహరిస్తుందని డీఎంకే 'మురసోలి'లో విమర్శించింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ప్రతి రాష్ట్రంలోనూ, ఇండియా బ్లాక్‌లోని తమ భాగస్వామ్య పక్షాలు అధికారంలోకి రాకుండా అడ్డుకోవడానికి కాంగ్రెస్ సాధ్యమైనదంతా చేసింది. అయినప్పటికీ పార్లమెంటు ఎన్నికలు వచ్చినప్పుడు మళ్లీ బిజెపికి వ్యతిరేకంగా పోరాడడం అనే పేరుతో భాగస్వామ్య పక్షాల మద్దతును కోరుతుంది అని మురసోలి పత్రిక వెల్లడించింది. కాగా, ఈ సందర్భంగా రాహుల్‌గాంధీనుద్దేశించి డిఎంకె తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యతపై చర్చించేందుకు ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియా బ్లాక్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీయే ప్రధాన విమర్శలకు గురైంది. దీనికి రాహుల్ గాంధీ రాజకీయ పరిణితి లేకపోవడమే, ఆయన నిజాయితీ లేని వైఖరే కారణం అని డీఎంకే అధికారిక పత్రిక పేర్కొంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తర్వాత కాంగ్రెస్ ప్లేటు ఫిరాయించింది. అప్పటివరకు ఇండియా బ్లాక్‌లో డిఎంకెతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్, ఫలితాల అనంతరం డిఎంకెతో చెప్పాపెట్టకుండా.. టివికెకి మద్దతు ఇచ్చి ఆ పార్టీ వైపు వెళ్లింది. దీంతో డిఎంకె కాంగ్రెస్ వైఖరి పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉంది. ?వెంటనే కాంగ్రెస్‌తో ఇక ఎప్పటికీ పొత్తు పెట్టుకోమని అని వెల్లడించింది.

# సర్వే పై అప్రమత్తంగా ఉండాలి

మొదటి తరువాయి



ప్రతి నియోజకవర్గ సమన్వయకర్త దీన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులతో జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు, తన అధికార దుర్వినియోగంతో ఏదోరకంగా వైయస్సార్‌సీపీకి చెందిన ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, బూత్‌కు కనీసం 50 ఓట్లు తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు. గిమ్మిక్కులతో ఓట్లు తొలగించే తప్పుడు పనుల్లో చంద్రబాబు ఆరితేరిన వ్యక్తని, వైయస్సార్‌సీపీ కోఆర్డినేటర్లు, బూత్‌లెవల్ ఏజెంట్లు దీన్ని అడ్డుకోవాలని, ప్రతి ఓటునూ కాపాడుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే ప్రక్రియపై ప్రతి అంశంలోనూ అప్రమత్తత, నిరంతర సమీక్షలు నిర్వహించాలని వైయస్.జగన్ ఆదేశించారు.

# సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

మొదటి తరువాయి

భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.

వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశిరచారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా,



ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేందప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# జూలై మూడో వారంలో తల్లికి వందనం!

మొదటి తరువాయి

పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల ప్రవేశాల పెంపు పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి.. తల్లి ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, జూలై 3వ వారంలో పథకం అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం, జూలై మూడో వారంలో మెగా పీటీఎం నిర్వహణకు సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల పని సర్దుబాటుపైనా సమావేశంలో చర్చించారు.

దన్నత విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష రాష్ట్రంలో ఏపీ సెట్, పాలిసెట్, ఆర్ సెట్ వంటి 12రకాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లకు ఎటువంటి జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత సమయంలో అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సెట్స్, పొరుగు రాష్ట్రాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ల తేదీలను కూడా గమనంలోకి తీసుకుని విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్రంలోని వివిధ సెట్ ల తేదీలను ఖరారు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్, సివిల్ విభాగాల సీట్లకు డిమాండ్ ఉందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కు సంబంధించి 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88లక్షల సీట్ల భర్తీకి గాను ఏపీ సెట్ నోటిఫికేషన్ కు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సిటీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ, మేధావి స్కిల్ యూనివర్సిటీ, జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో చర్చల పురోగతిపై మంత్రి సమీక్షించారు. జీఎంటర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటును వేగవంతం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్సీసీ కార్యకలాపాలు, క్యాంపస్‌లు సమన్వయం చేయడానికి ఎన్సీసీ (బీజ) స్టేట్ డైరెక్టరేట్‌ను మంజూరు చేసిన కేంద్రప్రభుత్వానికి మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ఎన్సీసీ వ్యవస్థను బలోపేతం చేయడానికి, ఆంధ్రప్రదేశ్ యువతకు మరింత సైనిక శిక్షణ, ప్రోత్సాహం అందించడానికి ఈ ప్రత్యేక కేంద్రం ఉపకరించగలదని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జే.శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్య కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# బీజేపీకి లబ్ధి చేకూర్చేలా 'సార్' ప్రక్రియ

మొదటి తరువాయి

అలాంటి దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ పక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ ఓనమాలు నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ దేశంలో అతికొద్దిమంది నిజాయితీ పరుల్లో మీనాక్షి నటరాజన్ ఒకరని పేర్కొన్నారు. అకారణంతోనే ఆమె రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించారని తెలిపారు. బీజేపీ వాళ్లకి కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల్లా ఉండాలని బీజేపీ నేతలు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మీ కంటే పెద్ద చక్రవర్తులే నేలమట్టం అయ్యారు.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఎంత..? అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం అనుకుంటే.. వారు మూర్ఖులే అవుతారన్నారు. దేవుళ్లకు ఎవరు వ్యతిరేకం కాదు.. కానీ దేవుడి పేరు చెప్పనిదే బీజేపీ వాళ్లకు ఓట్లు పడవన్నారు.

ఏడాదిలో చాలాసార్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూజలు నిర్వహిస్తారని.. కానీ దేవుళ్ల పేరుతో తాము ఓట్లు



అడిగమన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని.. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారంటూ కేంద్రంపై టీపీసీసీ చీఫ్ నిప్పులు చెరిగారు. ఇకపోతే జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఉందని టీపీసీసీ చీఫ్ విమర్శించారు. కమలం పార్టీ ఆడించినట్టే.. ఆయన ఆడుతున్నారని ఆరోపించారు. మీ సానుభూతి తమకేం అవసరం లేదని పవన్‌కు స్పష్టం చేశారు. మీ కుట్రలు ప్రజలు గమనిస్తున్నారని పవన్‌కు సూచించారు. తెలంగాణ వచ్చినప్పుడు 10 రోజులు అన్నం తినలేదని పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో చిట్టా ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. కేంద్రం నుంచి రాష్టానికి ఇంకా నిధులు రావాల్సి ఉందన్నారు. విభజన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మీరు సబర్మతి కట్టుకో వచ్చు.. తాము మూసి ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరని అసహనం వ్యక్తం చేశారు. వీటికి సమాధానం చెప్పాలంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్పష్టం చేశారు. ఓ వైపు బీజేపీ, మరో వైపు బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చీఫ్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.

### ద్రోణి ప్రభావంతో

# రాష్ట్రావ్యాప్తంగా వర్షాలు

మొదటి తరువాయి

జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఎండ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# అమెరికాలో కూలిన బీ-52 బాంబర్ విమానం..

మొదటి తరువాయి



బాంబర్ కూలిన తర్వాత ఆ ప్రాంతం నుంచి దట్టమైన నల్లటి పొగ కమ్ముకున్నది. బీ52 విమానానికి చెందిన ఎటువంటి ఆధారాలు కూడా లేకుండా కాలిపోయాయి. ప్రభుత్వ కాంట్రాక్టర్లు, మిలిటరీ సిబ్బంది ఆ విమానంలో ఉన్నారు.

ఫూటేజ్ పరిశీలించిన తర్వాత ఏ ఒక్కరు కూడా బ్రతికి ఉన్నట్లు తెలియడం లేదని కల్నల్ జేమ్స్ హేస్ తెలిపారు. 8 మంది గొప్ప అమెరికన్లు మృతిచెందారని, వారి కుటుంబాలకు ఈ విషయాన్ని చేరవేస్తున్నట్లు హేస్ చెప్పారు. ఏ కారణం చేత ప్రమాదం జరిగిందో ఇంకా నిర్ధారించలేదు. దర్యాప్తు పూర్తి కావడానికి సుమారు ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నది. రేడార్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్‌లో ఆ బీ-52 బాంబర్ పాల్గొన్నట్లు తెలుస్తోంది. బోయింగ్ బీ-52 స్ట్రాటోఫోర్ట్రెస్ లాంగ్ రేంజ్ బాంబర్.. 1955లో సర్వీస్‌లోకి వచ్చింది. సంప్రదాయ, అణ్వాయుధాలను మోసుకెళ్లే రీతిలో దీన్ని డిజైన్ చేశారు. ఈ బాంబర్ విమానాన్ని వియత్నాం నుంచి తాజా ఇరానీ యుద్ధం వరకు అమెరికా వాడింది. లాస్ ఏంజిల్స్‌కు 141 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎడ్వర్డ్స్ ఎయిర్ బేస్‌లో ఎక్కువ శాతం విమానాల టెస్టింగ్ నిర్వహిస్తుంటారు. ఎయిర్ ఫోర్స్ విమానాలు, వెపన్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్‌ను పరీక్షిస్తుంటారు. 412 టెస్ట్ వింగ్ ఇక్కడ పనిచేస్తుంది. టేకాఫ్ తీసుకున్న తర్వాత ఎక్కువ ఎత్తుకు కానీ ఎక్కువ దూరానికి కానీ వెళ్ల లేదని, అంటే ఫ్లయిట్ కంట్రోల్‌లో సమస్య వచ్చి ఉంటుందని నిపుణుడు జెఫ్ గుజెట్టి తెలిపారు.

# పారదర్శకంగా యూరియా పంపిణీ

మొదటి తరువాయి



టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు వెళ్లాలని రైతులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు వేగవంతం



**గంగాధర, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం కానుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో అదనపు తరగతి గదులు నిర్మించాలని నిర్ణయించారు.ఈ విషయమై ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తక్షణమే గదుల నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాశ్వత భవన నిర్మాణం కోసం మధురానగర్‌లో స్థలాన్ని పరిశీలించారు. గంగాధర ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, త్వరలోనే కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దమ్మని రాము, ఎమ్మార్వో అంబటి రజిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్, సర్పంచ్ వేముల భాస్కర్, నాయకులు అట్ల శేఖర్ రెడ్డి, పెంచాల చందు, దాతు అంజి, మేర్జ కొండయ్య, బైరిశెట్టి సంపత్, గుండవేని తిరుపతి పాల్గొన్నారు.గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు వేగవంతమయ్యాయి.

# ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలపై తక్షణ చర్యలు



**తిమ్మాపూర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, సామాజిక, అభివృద్ధి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఎమ్మెల్యే వినతి పత్రాలను పరిశీలించి, పాఠశాలలు, ఇళ్లు, పింఛన్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్, భూసంబంధ సమస్యలపై అధికారులకు సూచనలు చేశారు. అత్యవసర సమస్యల విషయంలో అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారం కోసం ఆదేశించారు.కొంతమంది ఆరోగ్య సమస్యలను వివరించగా, హాస్పిటల్ రిపోర్టులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే తక్షణ చర్యలు చేపట్టారు.

# రాజీవ్ రహదారిపై నిరంతరం వెలుగుతున్న హైమాస్ లైట్లు



**పాలకుర్తి, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాలుగు లైన్ల రాజీవ్ రహదారిపై హైమాస్ లైట్లు పగలే వెలుగుతుండడంతో ప్రయాణికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని అందుగులపల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద యూటర్న్ ప్రాంతంలో లైట్లు నిరంతరం వెలుగుతుండటం విద్యుత్ వృథా అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అనవసర సమయంలో లైట్లు వెలగడం ప్రజాధన వృథా అవుతుందని, ప్రధాన రహదారులపై ఇంత నిర్లక్ష్యం ఉంటే మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని పలువురు ప్రశ్నిస్తున్నారు.హైమాస్ లైట్ల నిర్లక్ష్య వినియోగంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నూతన వసతి గృహ భవనం మంజూరు కోసం ఏబీవీపీ నిరసన దీక్ష



**వెల్దండ, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష జరిగింది. ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహం శిథిలావస్థలో ఉందని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.నగర కార్యదర్శి వంశీ గౌడ్ మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తు కోసం నూతన భవనం వెంటనే మంజూరు చేయాలి. లేని పక్షంలో అమర నిరాహార దీక్షతో పాటు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రశాంత్ యాదవ్, శ్రీకాంత్, హరీశ్, శివరాం, శివచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా పుస్తకాలను విక్రయిస్తున్న ఆల్ఫోర్స్ పాఠశాలలు



**హుస్నాబాద్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, నోటుబుక్కులు విక్రయిస్తున్న ఆల్ఫోర్స్ పాఠశాలలో ఎంఈఓ పుస్తకాలను సీజ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి బత్తుల రాజు మాట్లాడుతూ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి పేద, బలహీన వర్గాల పిల్లలకు చదువును దూరం చేస్తున్నాయని విమర్శించారు. పాఠశాలలు సరస్వతి నిలయాలుగా ఉండాల్సిన చోట వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం జరగడంతో ఎంఈఓ మనీలా వచ్చి వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, ఎస్ఎఫ్ఐ కన్వీనర్ చరణ్, టౌన్ వైస్ ప్రెసిడెంట్, సోషల్ మీడియా కన్వీనర్ కుమార్, కళాశాల కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. ఆల్ఫోర్స్ పాఠశాలలో అక్రమ పుస్తకాల విక్రయంపై అధికారుల చర్యలు. విద్యార్థుల్లో చర్చనీయాంశమయ్యాయి.

# పారిశుద్ధ్యమే ప్రజారోగ్యానికి పునాది

**- మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగర పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ 29, 13, 38, 39 డివిజన్లలో పర్యటించారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించి, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.నగర ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం మున్సిపల్ సంస్థ ప్రధాన బాధ్యత అని మేయర్ పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు సోమిడి వేణు, తెల్ల లక్ష్మి రమేష్, మాసం గణేష్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, అధికారులు, శానిటేషన్ వర్కర్లు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.పారిశుద్ధ్యమే ప్రజారోగ్యానికి పునాది అని మేయర్ స్పష్టం చేశారు.

# వైభవంగా వరుణాభిషేకం



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పంచముఖ హనుమదీశ్వర స్వామి దేవాలయంలో అష్టోత్తర శత కలశ వరుణాభిషేకం, వరుణయాగం ఘనంగా జరిగింది. ప్రముఖ జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితుడు నమిలకొండ రమణాచార్య స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.వాతావరణ శాంతి, లోకకళ్యాణార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమత్ దీక్ష, చాలీసా పారాయణ చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.వర్షాలు కురవాలని ఆకాంక్షతో వరుణయాగం వైభవంగా జరిగింది.

# కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కురుమ సంఘం నాయకులు



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని జిల్లా కురుమ సంఘం నాయకులు మంగళవారం స్వగృహంలో కలిశారు. సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న ఆధ్వర్యంలో శాలువాతో సత్కారం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీర్ల బీరయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎల్కపెల్లి లచ్చయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే రాజు, సహాయ కార్యదర్శి మేకల నర్సయ్య, ట్రస్ట్ అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్, విద్యా కమిటీ ప్రధాన కార్యదర్శి దయ్యాల వీరయ్య, కర్రె రవి, మీస రమాదేవి, మీస మాధురి తదితరులు పాల్గొన్నారు.కురుమ సంఘం నాయకుల సత్కారం కరీంనగర్‌లో విశేషంగా జరిగింది.

# హిందూ బంధు సమ్మేళనంలో పౌర విధులపై పిలుపు



**ఖానాపూర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రతి హిందూ దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలని, దేశ అభివృద్ధి కోసం సామాజిక, పర్యావరణ, స్వదేశీ, కుటుంబ పౌర విధులను తప్పనిసరిగా పాటించాలని సీనియర్ ప్రచార ప్రాంత కార్యకారిని సువ్విర్ అన్నారు.మంగళవారం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన ఆత్మీయ హిందూ బంధు సమ్మేళనంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని, ప్రతి కుటుంబ సభ్యుడు రోజుకు ఒక గంట సమయం దేశానికి కేటాయించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ వస్తువుల వినియోగం, కుటుంబ ఐక్యత, పౌర విధుల ప్రాముఖ్యతపై ఉదాహరణలతో వివరించారు.వక్తలు సనాతన ధర్మం నిత్యనూతనమని, సామాజిక సమరసత, పర్యావరణ సంరక్షణ, స్వదేశీ వస్తువుల వినియోగం, కుటుంబ సంబంధాల బలోపేతం దేశ భద్రతకు కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నూకల విజయ్ కుమార్, కొత్తపల్లి రాజు, బెల్లపు రాజన్న, గడ్డం కిషన్ రెడ్డి, జితేందర్, సురేష్, గంగారావు, ఎనుగందుల నారాయణ, రమణ, అడ్డగట్ల రాజన్న, శైలేంద్ర, కన్నయ్య, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.దేశ భవిష్యత్తు కోసం హిందువుల ఐక్యత, పౌర విధుల ఆచరణ అవసరమని సమ్మేళనం స్పష్టం చేసింది.

# అక్షరాభ్యాసంతో నూతన విద్యార్థుల విద్యా ప్రయాణం



**ఖానాపూర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండలంలోని పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర పాఠశాల సంచాలకుల ఆదేశాల మేరకు బడిబాట షెడ్యూల్ ప్రకారం మంగళవారం ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులతో సరస్వతీ ఫోటో పూజ నిర్వహించి అక్షరాభ్యాసం చేపట్టారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. గాంధీనగర్, సత్తెనపల్లి, అర్జునవాడ, బాదం కుర్తి, కుసుంపూర్, బావాపూర్, సుర్జాపూర్, బుడగ జంగం వాడ, గుండు గూడ వంటి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సర్పంచులు, చైర్మన్లు పాల్గొన్నారు.అక్షరాభ్యాసంతో కొత్త విద్యార్థుల విద్యా ప్రయాణం ప్రారంభమైంది.

# ఘనంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలు



**ఖానాపూర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ శాసనసభ్యుడు బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలు మండలంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే పట్టణ ప్రధాన రహదారులపై భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. బాణసంచా, డప్పులు, డీజే పాటలతో ఎమ్మెల్యేను ఫంక్షన్ హాల్‌కు తీసుకువెళ్లి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జన్మదిన వేడుకలు నిర్వహించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేసినందుకు రుణపడి ఉన్నానని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగిల్ శంకర్, టౌన్ అధ్యక్షుడు గొర్రె గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్లు రాజుల సత్యం, నిమ్మల రమేష్, సర్పంచ్ లక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వాజిద్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, అమానుల్లా ఖాన్, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ తన ఇంటిలో కేక్ కట్ చేయగా, రాజుల సత్యం కెఎన్ఆర్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో కూడా జన్మదిన సంబరాలు జరిగాయి. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలు ఖానాపూర్‌లో ఉత్సాహంగా జరిగాయి.

# బోరు వైరు దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి



**హుస్నాబాద్ , జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన రైతు చీమూర్తి వెంకన్న పొలంలో గుర్తు తెలియని దొంగలు బోర్ మోటార్‌కు సంబంధించిన విద్యుత్ వైరును దొంగలించారు.డబ్బా నుండి మోటార్ వరకు ఉన్న సుమారు 50 మీటర్ల వైరును కట్ చేసి ఎత్తుకెళ్లడంతో రైతుకు ఆర్థిక నష్టం వాటిల్లింది. సాగునీటి పనులకు అంతరాయం ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు.గతంలో కూడా మండలంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి దొంగతనాలు జరిగినట్లు సమాచారం. వరుసగా జరుగుతున్న చోరీలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్సై వంశీకృష్ణ, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. రైతుల ఆందోళనకు కారణమవుతున్న బోర్ వైరు దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

# శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. యాజమాన్యం ప్రైవేట్ గదిలో పుస్తకాలు అమ్ముతున్న స్థావరం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, పుస్తకాలను డీఈఓ కార్యాలయానికి తరలించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ ఒక్కో పదో తరగతి విద్యార్థి నుంచి రూ.16 వేల వరకు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ ఆదేశాలను, హైకోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టి ప్రైవేట్ పబ్లిషర్స్ పుస్తకాలను బలవంతంగా రుద్దుతున్నారని విమర్శించారు. అక్రమ దందాకు విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణమని ఆరోపించారు. తక్షణమే గుర్తింపును రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షుడు వినయ్, సహాయ కార్యదర్శి బోగేశ్వర్, నాయకులు ఆకాష్, సభ్యులు సందేశ్, సన్నీ, మానస, సంజన, అంజి తదితరులు పాల్గొన్నారు. శ్రీ చైతన్య పాఠశాలపై ఎస్ఎఫ్ఐ నిరసన విద్యార్థుల్లో చర్చనీయాంశమైంది.

# మూడవ డిస్కం రద్దు చేయాలని సిఐటియు డిమాండ్



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు డిస్కాం వినియోగదారులకు నష్టదాయకమని, దాన్ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ రమ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా పాల డైరీలు, సా మిల్లులు, షాపులు, పెట్రోల్ బంకులు, హాస్పిటల్స్‌లో కనీస వేతనాలు జీఓ ప్రకారం చెల్లించాలని కోరారు. ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పులలో కూరుకుపోయిన డిస్కాంలకు ప్రభుత్వం రూ.45,398 కోట్లు విడుదల చేయాలని, ప్రైవేటీకరణ వ్యతిరేకంగా గ్రామీణ స్థాయిలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఆర్టీసీ సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18,000, బీమా, రిటైర్మెంట్ సౌకర్యాలు కల్పించాలని, ఐసిడిఎస్, అంగన్వాడీలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్, గ్రామపంచాయతీ, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్మిక సమస్యలపై నిర్లక్ష్య ధోరణి కొనసాగితే మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు పిలుపునిచ్చింది.

# తెలంగాణ రక్షణ సేన సమక్షంలో రౌండ్ టేబుల్ సమావేశం



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: తెలంగాణ ఉద్యమ పోరాటం, అస్థిత్వం, ఆత్మగౌరవం, ఉద్యమ ఆకాంక్షలు, భవిష్యత్ కార్యాచరణ అంశాలపై తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఈనెల 18న నగరంలోని ఈఎన్ గార్డెన్స్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఉద్యమకారులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మేధావులు, బిసి, కుల, మహిళ, కార్మిక, రైతు, విద్యార్థి, యువజన సంఘాలు, కవులు, కళాకారులు, రచయితలు తదితరులను ఆహ్వానించినట్లు బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయనున్నారు. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# వృద్ధురాలి మేడలో చైన్ స్నాచింగ్ బోడుప్పల్‌లో దుండగుడి దాడి

**మేడిపల్లి/బోడుప్పల్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బోడుప్పల్ ఈస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో నివాసముంటున్న నర్రా అరుణ (72) మంగళవారం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన సమయంలో దుండగుడు ఆమెను లక్ష్యంగా చేసుకున్నాడు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గమనించిన అతడు ఆమె మేడలోని 4.5 తులాల మంగళసూత్రాన్ని లాక్కొని బైక్‌పై పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# బోటనీ విభాగంలో తొలి పీహెచ్‌డీ మార్గదర్శకుడిగా నిలిచిన ప్రొఫెసర్ శ్రీనివాస్



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్వయంప్రతిపత్తి బోటనీ విభాగాధిపతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్ రాష్ట్రంలోనే తొలి బోటనీ పీహెచ్‌డీ పరిశోధన మార్గదర్శకుడిగా చరిత్ర సృష్టించారు. ఆయన మార్గదర్శకత్వంలో పరిశోధక విద్యార్థి రాజశేఖర్ తన డాక్టరేట్‌ను విజయవంతంగా పూర్తి చేయడం కళాశాలకు గర్వకారణమైంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిధిలో బోటనీ విభాగంలో తొలి పీహెచ్‌డీ మార్గదర్శకుడిగా నిలవడం విశేషమని అధ్యాపకులు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ పరిశోధన రంగంలో కళాశాల ప్రతిష్ఠను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో శ్రీనివాస్ పాత్ర ప్రశంసనీయమని తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రౌతు రాధాకృష్ణ, డాక్టర్ పడాల తిరుపతి, డాక్టర్ మహబూబ్ మహమ్మద్ హుస్సేన్, శ్రీమతి కళాజ్యోతి, డా. శ్యామల చంద్ర, డాక్టర్ బుంగ తిరుపతి, మహమ్మద్ తాజుద్దీన్, స్వరూప రాణి పాల్గొన్నారు. బోటనీ విభాగంలో తొలి పీహెచ్‌డీ మార్గదర్శకుడిగా నిలిచిన ప్రొఫెసర్ శ్రీనివాస్ ఘనత విశేషం.

# చెర్కూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ

**విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా పుస్తకాలు**



**వెల్దండ, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు హాజరై విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని ఆకాంక్షించారు. అలాగే, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలరాజు, హెచ్‌ఎం మౌనిక, కేశమోని జంగయ్య, అల్లే సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన సామాజిక శాస్త్ర విభాగంలో కొండా దేవేందర్ కి పిహెచ్డి పరిశోదక పట్టా




**కరీంనగర్,జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయంలోని విశ్వవిద్యాలయ కళలు సామాజికశాస్ర కళాశాల లోని సామాజిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్ డిగ్రీని పరిశోధక విద్యార్థి కొండ దేవేందర్ కి అందజేశారు. తన పరిశోధన గ్రంథం ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ ఆఫ్ మైగ్రేట్ వర్కర్స్ ఇన్ పోస్ట్ కోవిడ్ ఏ స్టడీ ఆఫ్ ఎరస్ట్ వైలే కరీంనగర్ డిస్ట్రిక్ట్ అనే పరిశోదక అంశం తీసుకొని సమాజ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సూరేపల్లి సుజాత పర్యవేక్షణలో పరిశోదన చేసి మౌఖిక పరీక్షలో నిరూపించించిన గ్రందానికి డాక్టరేట్ డిగ్రీకి (పరిశోధక పట్టాకు) అర్హత సాధించినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా.డి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ డిగ్రీకి పర్యవేక్షణ వహించిన సామాజిక శాస్త్ర విభాగ బి.ఓ.ఎస్ ఒ ప్రిన్సిపాల్ డా.కే. పద్మావతికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ కి రిజిస్ట్రార్ సతీష్ కుమార్ కి అధ్యాపకులకు పరిశోధక విద్యార్థి కృతజ్ఞతలు తెలియజేశారు.

# దేశ అభివృద్ధి, తెలంగాణ పురోగతికి బీజేపీ కట్టుబడి ఉంది

**- మంత్రి బండి సంజయ్**



**మానకొండూర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మానకొండూరులో ఆర్ఎంపీ డాక్టర్లతో ఛాయ్ పే చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ అక్రమ చొరబాటుదారుల ఓట్లను తొలగించడంలో తప్పేమీ లేదని, కాంగ్రెస్ పార్టీ మతాల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని, గత 12 ఏళ్లలో 12 లక్షల కోట్ల రూపాయలకుపైగా నిధులు ఇచ్చిందని తెలిపారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లకు వేల కోట్ల నిధులు కేటాయించామని, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని అన్నారు. బీఆర్ఎస్‌లో మావోయిస్టు భావజాలం ఉన్న నేతలు ఉన్నారని, అలాంటి వారు సమాజానికి ప్రమాదమని హెచ్చరించారు. తుపాకీతో సాధించేదేమీ లేదని, మావోయిస్టు నేతలు భావజాలాన్ని వీడి ప్రజా జీవన స్రవంతిలో కలవాలని సూచించారు. మోదీ పాలనలో అవినీతి లేకుండా 12 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారని, రైతు ఆదాయం రెట్టింపు అవుతోందని, స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా ద్వారా స్వదేశీ ఉత్పత్తులు ఎగుమతి స్థాయికి చేరాయని సంజయ్ తెలిపారు. దేశ అభివృద్ధి, తెలంగాణ పురోగతికి బీజేపీ కట్టుబడి ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు



**హుస్నాబాద్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్కన్నపేట మండలంలోని రామవరం రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం జరిగింది. సిద్ధిపేట జిల్లా వ్యవసాయాధికారి స్వరూపారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ అనుభవాలను పంచుకుని ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం తయారీ విధానం, వాటి ప్రయోజనాలను వివరించారు. యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి స్వరూపారాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, రసాయన రహిత పంటలు పండే అవకాశం ఉంటుందని తెలిపారు. యూరియా యాప్‌లో ముందస్తు బుకింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని, రైతు వేదికలను జ్ఞాన వేదికలుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, సర్పంచ్ పొన్నాల వెంకమ్మ, ఎఫ్‌పీఓ చైర్మన్ స్వామిరెడ్డి, ఫెర్టిలైజర్ డీలర్లు, రైతులు శంకర్, కర్ణాకర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించిన రైతు నేస్తం కార్యక్రమం విజయవంతమైంది.

# నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూన్ 21న జరగనున్న నీట్ పరీక్షను భద్రతా చర్యల మధ్య పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్య, వైద్య, పోలీస్, ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్ శాఖలతో సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాలోని ఏడు కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5:15 వరకు పరీక్ష జరుగుతుందని, ఈసారి 15 నిమిషాలు అదనంగా సమయం ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు పాస్ ఫోటో గుర్తింపు కార్డు, అడ్మిట్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని, ఆభరణాలు, షూలు ధరించరాదని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, విద్యుత్ సమస్యలు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు మందులతో శిబిరం ఏర్పాటు చేయాలని, రెండు రోజుల ముందే అధికారులు కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. అదే రోజున యోగా దినోత్సవ ర్యాలీ ఉండటంతో విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టాలని, ప్రశ్నాపత్రాల రవాణాకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నోడల్ ఆఫీసర్ పంకజ్ సింగ్, డీఈఓ ప్రశాంత్, ఏసీపీ సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పరీక్షా నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# మల్లికార్జున స్వామి ఆలయంలో ఘనంగా రేణుక మాత ఉత్సవాలు

**-భక్తుల కోలాహలంతో గుట్ట పరిసరాలు మారుమోగిన వేడుకలు**



**మెదక్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెదక్ మండలంలోని కొయ్యగట్టు మల్లన్న స్వామి దేవాలయంలో శ్రీ రేణుక మాత (ఎల్లమ్మ) ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఏటా నిర్వహించే ఈ సాంప్రదాయ వేడుకలకు మెదక్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, బోనాలతో ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు సాంప్రదాయబద్ధంగా తలలపై బోనాలు ఎత్తుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కళాకారుల డప్పు చప్పుళ్లు, శంఖునాదాలు, తాళాల మోతతో గుట్ట పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభతో మారుమోగాయి. భక్తులలో భక్తి ఉత్సాహాన్ని నింపుతూ కళాకారులు తమ సాంప్రదాయ శైలిలో డప్పులు వాయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సభ్యులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# టాస్క్‌ఫోర్స్ దాడిలో అక్రమ ఇసుక డంప్ సీజ్



**కరీంనగర్ రూరల్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా తీవ్రం చేశారు. ఏసీపీ వాసాల సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆకస్మిక దాడిలో కొత్తపల్లి మండలం రాములపల్లి గ్రామంలో ఒక భారీ అక్రమ ఇసుక డంప్‌ను పోలీసులు కనుగొని సీజ్ చేశారు.సీజ్ చేసిన డంప్‌లో 50కు పైగా ట్రాక్టర్ల లోడుల అక్రమ ఇసుక నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను తదుపరి చట్టపరమైన చర్యల కోసం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం, నిల్వ, రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని, వాహనాలను సీజ్ చేసి మైనింగ్ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతుందని సీపీ గౌష్ ఆలం హెచ్చరించారు.

# శిశు మందిర్ పాఠశాలలో గాయత్రి యజ్ఞం



**జమ్మికుంట, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గాయత్రి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. చిన్నారులను ఆహ్వానిస్తూ ఆచార్యులు, కమిటీ సభ్యులు పూలతో స్వాగతం పలికారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన యజ్ఞంలో విద్యార్థులు, విద్యాభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా పీఠం పెద్దలు బూర్ల దక్షిణామూర్తి, పాక సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి తేళ్ల రాజమౌళి, సమితి కార్యదర్శి ఆకుల రాజేందర్, ప్రబంధకారిణి అధ్యక్ష కార్యదర్శులు శీలం శ్రీనివాస్, దాసరి రవీందర్, బుర్ర శివయ్య, బాదం రమేష్, ప్రధానాచార్యులు గుడికందుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. చదువుతో పాటు విజ్ఞానాన్ని అందించే శిశు మందిరాల ప్రాధాన్యం ఈ కార్యక్రమంలో ప్రతిఫలించింది.లిలి

# రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన రశ్మితను అభినందించిన కలెక్టర్



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని కడారి రశ్మితను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రత్యేకంగా అభినందించారు.కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రశ్మితను సత్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ 470 మార్కుల్లో 469 సాధించడం విశేషమని, క్రమశిక్షణ, పట్టుదలతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో చదువును కొనసాగించాలని సూచించారు.విద్యార్థిని విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఈఓ ప్రశాంత్ రెడ్డి, కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, రామడుగు సర్పంచ్ మొయిజ్, ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, శిరీష తదితరులు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన రశ్మితను జిల్లా గర్వకారణంగా కలెక్టర్ కొనియాడారు.

# బాలల స్నేహపూర్వక మండలంగా తీర్చిదిద్దడమే లక్షం - డిఆర్డిఏ



**తిమ్మాపూర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో స్నేహ కిషోర్ బాలికల సంఘాలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా బాలికలకు మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్ లైన్ సేవలు, బాల్య వివాహాల నిరోధం, ఆరోగ్యం, జీవన నైపుణ్యాలు, పోషకాహారం, శానిటేషన్, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి, బాలికల భవిష్యత్తు రక్షణకు సమాజం కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం సంపత్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ, మిషన్ వాత్సల్య ప్రతినిధి సాదినేని రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది సాయికిరణ్ గౌడ్, ఎడ్ల ప్రియాంక, హెల్త్ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కిషోర్ బాలికలు పాల్గొన్నారు.తిమ్మాపూర్‌ను బాలల స్నేహపూర్వక మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.మీకు ఆసక్తి ఉంటే, నేను బాల్య వివాహాల ప్రభావం, ప్రకృతి వ్యవసాయం, లేదా మిషన్ వాత్సల్య లక్ష్యాలు గురించి మరింత వివరంగా చెప్పగలను.

# భవాని శంకరాలయం విగ్రహ ప్రతిష్ఠకు కలెక్టర్‌కు ఆహ్వానం



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో నాయకులు పలు మర్యాదపూర్వక కార్యక్రమాలు నిర్వహించారు.భగత్‌నగర్ టీఎన్జీవోల కాలనీలో నిర్మితమైన శ్రీ భవాని శంకరాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికను అందజేసి కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో శర్మిలను, డీఆర్ఓ కె. స్వామిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, గంగారపు రమేష్ గౌడ్, కిరణ్ కుమార్ రెడ్డి, మారుపాక రాజేష్ భరద్వాజ్, వెలిచాల సుమంతరావు, వాస్తవిక్ గౌడ్, కొమ్మర శ్రీనివాస్ రెడ్డి, మహిళా నాయకులు శారద, సునీత, శైలజ, కోట రామస్వామి, శంకర్, కరుణాకర్, లవ్ కుమార్, నారాయణ, శ్రీనివాస్, రవీందర్, ఆలయ కమిటీ ప్రతినిధి రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
భవాని శంకరాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి జిల్లా కలెక్టర్‌ను ఆహ్వానించిన టీఎన్జీవోల నాయకులు.

# తాళం వేసిన ఇంటిలో చోరీ



**గంగాధర, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని నాగిరెడ్డిపూర్ గ్రామంలో తాళం వేసిన ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.పిర్యాదుదారుడు సుంకనపల్లి రమేష్ జూన్ 12న మధ్యాహ్నం కుటుంబంతో హైదరాబాద్ వెళ్లి, జూన్ 15 రాత్రి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి, బీరువాను ధ్వంసం చేసి సుమారు 13.75 తులాల బంగారు ఆభరణాలను దొంగలించినట్లు గుర్తించారు.సమాచారం అందిన వెంటనే చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్సై వంశీకృష్ణ, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.తాళం వేసిన ఇంటిలో జరిగిన ఈ చోరీతో గ్రామంలో ఆందోళన నెలకొంది.

# పిచ్చికుక్కల బెడదపై నివారణ చర్యలు చేపడతాం

**- ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి**





**గన్నేరువరం, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గునుకుల కొండాపూర్ గ్రామంలో పిచ్చికుక్కలు దాడి చేసి గుండ పరశు రాములు, ఊట్ల పోచమ్మలను తీవ్రంగా గాయపరిచాయి. ఇంట్లో చికిత్స పొందుతున్న పరశు రాం గౌడ్‌ను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, ఉప సర్పంచ్ న్యాలపట్ల రమేష్, పాలకవర్గ సభ్యులు పరామర్శించారు.సర్పంచ్ అజయ్ వర్మ మాట్లాడుతూ కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వృద్ధులు, చిన్న పిల్లలు బయట తిరగలేని పరిస్థితి ఏర్పడిందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఎంపీడీవో స్పందిస్తూ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో సురేందర్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్ హనుమాన్ల యాదగిరి, కారోబార్ ముల్కల అంజయ్య, వార్డు సభ్యుడు చొక్కాల్లా లక్ష్మయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.పిచ్చికుక్కల బెడదపై నివారణ చర్యలు త్వరలోనే చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన అదనపు కలెక్టర్



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజన వంటగది, మంచినీటి ట్యాంకులు, ఆట స్థలం వంటి మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలిస్తూ రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్ నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు చక్కటి చేతిరాత అలవాటు చేయాలని, సబ్జెక్టులలో ప్రాథమిక భావనలపై బలోపేతమైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సాంఘిక శాస్త్రంలో రాష్ట్రాలు, రాజధానులు, ప్రధాన నదులు, భారతదేశం మరియు తెలంగాణ పటాలను విద్యార్థులతో గీయించి అవగాహనను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠ్యపుస్తకాల పంపిణీ, సన్నద్ధత కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మరిన్ని మెరుగుదలల కోసం సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రశాంత్ రెడ్డి, కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆర్. రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.

# విద్యార్థుల రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీలు






**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాఠశాల విద్యార్థుల రవాణా వాహనాలపై పోలీస్, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని 17 స్కూల్ బస్సులు, 50 ఆటోలు సీజ్ చేయగా, సరైన పత్రాలు లేని 64 వాహనాలపై, యూనిఫాం ధరించని 13 మంది డ్రైవర్లపై, నంబర్ ప్లేట్ లేని వాహనం, ఓవర్‌లోడింగ్‌తో నడిపిన 9 వాహనాలపై చర్యలు తీసుకున్నారు. మొత్తంగా 87 వాహనాలపై ఉల్లంఘనలు నమోదు చేశారు.పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రతి చిన్నారి భద్రత మనందరి బాధ్యత. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేసి, మైనింగ్ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. కవిత, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల భద్రత కోసం వాహనాలపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

# ఘనంగా సర్పంచ్ మట్ట యాదమ్మ -వెంకటయ్య గౌడ్ వివాహ వేడుకలు



**వెల్దండ, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ నివాసంలో మంగళవారం వివాహ వేడుకలను పురస్కరించుకుని గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి గిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి రషీద్, వార్డు సభ్యులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, పసునోజు వాణి పురుషోత్తం, ముదికొండ కవిత రమేష్, మసిగుండ్ల వెంకటేష్, మారేపల్లి మంజుల శ్రీను, పిల్లి దేవేందర్, బాదేపల్లి రమేష్, జంగిలి సునీత ఆనంద్, రేవల్లి మానస రాజు, ఎస్. శేఖర్, జి. రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాభ్యాసంతో చిన్నారుల విద్యా ప్రయాణం ప్రారంభం



**హుజురాబాద్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. విద్యార్థుల విద్యా జీవితానికి తొలి మెట్టుగా భావించే ఈ కార్యక్రమంలో చిన్నారులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, మనోజ్ రావు, డీఈఓ ప్రశాంత్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు రాధిక, శోభ రాణి, వార్డ్ కౌన్సిలర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అక్షరాభ్యాసంతో చిన్నారుల విద్యా ప్రయాణం ప్రారంభమైంది.

# ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు సువర్ణావకాశం



**పెద్దపల్లి, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా విద్యార్థులకు గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్ వారు ప్రత్యేక శిక్షణా అవకాశాన్ని కల్పిస్తున్నారు. 2024--25, 2025--26 విద్యా సంవత్సరాల్లో ఎంపీసీ, బైపీసీ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఎంపికైతే, మూడు నెలల శిక్షణలో నెలకు రూ.15 వేల స్టైపెండ్‌తో పాటు వసతి కల్పిస్తారు. అనంతరం టాటా ఇన్స్టిట్యూట్ ద్వారా ఫార్మసీ గ్రాడ్యుయేషన్ డిగ్రీలో ప్రవేశం కల్పించి, సెమిస్టర్ ఫీజు రూ.30 వేలును సంస్థే భరిస్తుంది. హాస్టల్ వసతి కూడా కల్పించబడుతుంది. కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20లోపు పెద్దపల్లి కలెక్టరేట్‌లోని ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పనను సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ఈ శిక్షణా కార్యక్రమం సువర్ణావకాశంగా నిలుస్తోంది.

# ఓదెల మల్లన్న ఆలయానికి మాస్టర్ ప్లాన్



**పెద్దపల్లి, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రసిద్ధ ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు కేటాయించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో రూ.10 కోట్లు ప్రభుత్వం, రూ.5 కోట్లు ఆలయ ప్రత్యేక నిధుల ద్వారా కేటాయించగా, మొత్తం రూ.15 కోట్లతో ఆలయ పునరుద్ధరణ చేపట్టనున్నారు. హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో స్థాపతి వల్లినయాగన్ ఆలయ మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావుకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఓదెల మండల పార్టీ అధ్యక్షులు, ఆలయ చైర్మన్, డైరెక్టర్లు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

# కళాభారతిలో ఘనంగా జరగనున్న మేధావుల సమావేశం



**కరీంనగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పరిపాలనను పురస్కరించుకుని ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు కళాభారతిలో మేధావుల సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి సన్నాహకంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మేధావుల ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు. అలాగే, గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, పరిపాలనా విజయాలను వివరించే ప్రత్యేక బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. జూన్ 20న కళాభారతిలో మేధావుల సమావేశం ఘనంగా జరగనుంది.

# ఓటరు నమోదు ప్రక్రియలో బిఎల్ ఏ లపాత్ర అత్యంత కీలకం





## -ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**దేవరకొండ, జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ.ఆర్) ఓటరు నమోదు ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బి.ఎల్.ఏలు) కీలక బాధ్యతను నిర్వహించాల్సి ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పేర్కొన్నారు.
మంగళవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటర్ల హక్కులను పరిరక్షించడంలో బి.ఎల్.ఏ.లపాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు.
దేశవ్యాప్తంగా అమలు చేయనున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఏ లు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయడం ద్వారా దళితులు, బడుగు బలహీన వర్గాలు, మైనారిటీలు, యువత మరియు మహిళల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బి ఎల్.ఏ.లకు సార్ ప్రక్రియ విధివిధానాలు, ఓటర్ల నమోదు పద్ధతులు, ఎదురయ్యే సవాళ్లు, వారు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి బి ఎల్ ఎ తన బూత్ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని, ఏవైనా లోపాలు లేదా సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఓటర్ల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల సహకారంతో ఎదుర్కొంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ మండలాల బి.ఎల్.ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం





**- దేవరకొండలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం.**
**-మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**
**- బిఆర్ఎస్ నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్.**



**దేవరకొండ జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలో సాయి శివ ఫంక్షన్ హాల్ లో మంగళవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ బూతు స్థాయి ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జగదీష్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం జగదీశ్ రెడ్డి మాజీ మంత్రి, రమావత్ రవీంద్ర కుమార్, మాజీ శాసన సభ్యులు మాట్లాడుతూ బీహార్ ఎన్నికల కమిషన్ తీరుపై అనుమానం ఉందని తేజస్వి యాదవ్ గెలుస్తాడని సర్వే లు చెప్పిన బిజెపి ఎలా గెలిచిందని ప్రశ్నించారు. దేవరకొండలో బీఆర్ఎస్‌కు ప్రజా మద్దతు ఉందని కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నారు ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే దేవరకొండలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని వారు అన్నారు లక్ష మంది చంద్రబాబులు, లక్ష మంది మోదీలు కలిస్తే వచ్చే హైబ్రిడ్ ముఖ్యమంత్రి రేవంత్ అని, ప్రీ-మ్యాపింగ్ ప్రక్రియను అధికారుల గదుల్లో కూర్చొని నిర్వహించారు . అధికారులే వినట్లేదని తన స్వభావాన్ని బయటపెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్‌ను ఆదర్శంగా చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి ఇద్దరూ డ్రామా ఆడుతూ తిట్టుకుంటున్నారు .డ్రామాలో భాగంగానే మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు రాకుండా చేశారు .కేసీఆర్ ఇచ్చిన కరెంట్‌ను కూడా సక్రమంగా ఇవ్వలేకపోతున్నారు రోడ్లకు తట్టెడు మట్టి కూడా పోయలేదు ఈ ప్రభుత్వంఅని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు,ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆత్మరక్షణకు కరాటే అవసరం





**ఆమనగల్లు, జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరికి కరాటే అవసరమని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. ముఖ్యంగా బాలికలు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. సీనియర్ కరాటే మాస్టర్ సీ. జగదీశ్వర్ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థిని, విద్యార్థులకు వివిధ బెల్ట్ గ్రేడింగ్ లో పోటీలను నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంగళవారం పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము సమక్షంలో బ్లాక్ బెల్ట్, వివిధ రకాల బెల్ట్ లు మరియు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చిన మార్పులతో శరీరానికి శ్రమ లేకపోవడంతో ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోజూ కొంత సమయం ఆటలతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటే శిక్షణకు కేటాయించాలని సూచించారు. బాలికలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో జూనియర్ మాస్టర్ ప్రవీణ్, తల్లిదండ్రులు మహేష్, శ్రీను నాయక్, అశోక్, మహేష్, భాస్కర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో అధికారుల ఆకస్మిక తనిఖీ




**తెలకపల్లి, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ మంగళవారం జెడ్పిహెచ్ఎస్ తెలకపల్లి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పాఠశాల నిర్వహణ, బోధన విధానాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు. అనంతరం డీఈఓ విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలోని సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించి ప్రసాదం స్వీకరించారు. అదేవిధంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ హనుమాన్ దేవాలయానికి ధూపదీప నైవేద్య జీతం మంజూరు చేయాలి

**-మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేసిన చిన్న ఉమ్మెంతల గ్రామస్తులు**



**షాద్‌నగర్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం చిన్న ఉమ్మెంతల గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయానికి ధూపదీప నైవేద్యాల నిర్వహణ కోసం జీతం మంజూరు చేయాలని గ్రామస్తులు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. గ్రామ నాయకుడు ఉమ్మెంతల కృష్ణారెడ్డి మాట్లాడుతూ, "దేవాలయానికి ప్రత్యేకంగా జీతం లేకపోవడంతో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు" అని తెలిపారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మంత్రి సురేఖకు సిఫార్సు లేఖ అందజేసినట్లు వివరించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే సిఫార్సు లేఖతో కలిసి మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించగా, మంత్రి సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఏనుగు జంగారెడ్డి, బ్రహ్మయ్య చారి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లలో యూనిఫామ్, బుక్స్ ధరలు తగ్గించాలని డిమాండ్




**మెదక్, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో యూనిఫామ్‌లు, బుక్స్ అమ్మకాలు, ఫీజులపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఎల్కేజీకి 4,000-- 6,000, టెన్త్ క్లాస్ విద్యార్థుల నుండి 16,000-- 20,000 వరకు వసూలు చేస్తున్నారు. పేద విద్యార్థులపై అధిక భారం మోపుతున్నారు" అని మండిపడ్డారు. యూనిఫామ్, బుక్స్ పేరుతో తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "జిల్లాలోని అన్ని ప్రైవేట్ స్కూళ్లలో బుక్స్, యూనిఫామ్, నోట్‌బుక్స్ అమ్మకాలు, ఫీజుల వసూళ్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏ. మల్లేశం, కే. మల్లేశం, సంతోష్ నాయకులు, దుర్గ, అజయ్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐ కి ఘన సన్మానం



**ఆమనగల్లు, జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కోటేశ్వరరావు ని మంగళవారం మేడిగడ్డ తండాకు చెందిన వార్డ్ సభ్యులు మణిపాల్ నాయక్, బీజేవైఎం నాయకులు జైరాం నాయక్, మల్లేష్ నాయక్, సోషల్ మీడియా కన్వీనర్ నందు రాథోడ్ లు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామంలో అందరు కలిసి మెలిసి ఉండాలని, శాంతిభద్రతలకు అందరు సహకరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, అనేలైన్ సైబర్ మోసగాళ్ల వలలో పడకూడదని ఎవ్వరైనా అనుమాస్పదంగా కనిపిస్తే వస్తే మాకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# జాతీయ మాల మహానాడు కల్వకుర్తి తాలూకా అధ్యక్షుడిగా శాంపూరి శ్రీనివాస్



**వెల్దండ, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ మాల మహానాడు సంఘం కల్వకుర్తి తాలూకా అధ్యక్షుడిగా కొట్ర గ్రామానికి చెందిన శాంపూరి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. రాష్ట్ర కార్యదర్శి చింతసత్తి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత రత్న అవార్డు గ్రహీత రావుల శ్రీనివాస్కు ఘన సన్మానం జరిగింది. గతంలో కొట్ర గ్రామ సర్పంచ్ శాంపూరి శారద చెన్నయ్యను కూడా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్డి మనెమ్మ, కార్యదర్శి కానుగుల భారతి, బాలరాజు, ఆంజనేయులు, నాయిని బుజ్జయ్య, శాంపూరి వెంకటయ్య, నారిమల్ల గోపాల్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నేరాల పై జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం

**పెండింగ్ కేసులపై దృష్టి, సాంకేతిక దర్యాప్తు సూచనలు**





**నంద్యాల, జూన్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో నెలవారీ నేరాల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్నీ సబ్ డివిజన్ల పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతిని సమీక్షించి, కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. యు.ఐ కేసులు తగ్గించుకోవాలని, నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ అగైనెస్ట్ ఉమన్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులను సమీక్షించారు. "నమోదైన కేసుల్లో సమగ్ర దర్యాప్తు జరిపి, న్యాయస్థానాల్లో తగిన ఆధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలి" అని ఎస్పీ స్పష్టం చేశారు. సీసీటీఎన్స్‌లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు పొందుపరచాలని, కీలకమైన కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెంచాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేయాలని, హైవే రహదారులపై వాహనాల తనిఖీలు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలు, ఏపీకే ఫైల్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. మట్కా, పేకాట, అక్రమ మద్యం రవాణా, గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలపై ముందస్తు సమాచారం సేకరించి ఎన్డీపీఎస్ కేసులు నమోదు చేయాలని, డీఎస్పీ స్థాయి అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎన్. యగంధర్ బాబు, నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం. జావళి ఐపీఎస్, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, రామంజినాయక్, శ్రీనివాస్, శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# అమ్మ మాట అంగన్వాడీ బాట



**ఆమనగల్లు, జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని అంగన్వాడి 10వ సెంటర్లో మంగళవారం అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శాంతిరేఖ హాజరై మూడేళ్లు నిండిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలను పంపించాలన్నారు. పౌష్టికాహారంతో పాటు, ఆటపాటలతో కూడిన విద్యను అందించనున్నట్లు తెలిపారు. పుట్టిన శిశువు వెయ్యి రోజులు వచ్చే వరకు తల్లిపాలతో పాటు, సరైన పౌష్టికాహారంను అందించడం వల్ల వారిలో ఎదుగుదలతో పాటు, ఆరోగ్యంగా ఉంటారని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు సరైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అనిత, టీచర్ నాజీమా, ఆయా యాదమ్మ మరియు తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సహాయం



**ఆమనగల్లు, జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వెల్దండ మండలం నారాయణపూర్ తండాకు చెందిన శోభా సురేష్ నాయక్ కూతురు మానస వివాహానికి ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవే తమ లక్ష్యమని, ముఖ్యంగా పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు సహాయం చేయడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**ఆమనగల్లు, జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన కంబాలపల్లి వెంకయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ నిట్ట నారాయణ మంగళవారం మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తనవంతు సహాయంగా 5 వేల రూపాయలు అందజేశారు. ఆయన వెంట నాగర్ కర్నూల్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాదగిరి, భాస్కర్, గంధం బాలరాజ్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**- సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ నాయక్**

**- ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్**

**- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ**



**అమనగల్లు, జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు వంటి వసతులు ఉంటాయని సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ నాయక్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ పేర్కొన్నారు. అమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ లు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు, ప్రైవేట్ కంటే దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. నేటి పోటీ కాలంలో విద్యార్థులు కష్టం అనకుండా ఇష్టపడి చదివి, తల్లిదండ్రులతో పాటు గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని విద్యార్థులను కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, ఉపాధ్యాయులు సంతోషి రాథోడ్, వార్డు సభ్యులు సీతారాం నాయక్, సీతి భాస్కర్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, అంగన్వాడీ టీచర్లు సరోజ, నుశ్రాత్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి

**- ఎమ్మెల్యేను సన్మానించిన సర్పంచ్ల ఫోరం**



**ఆమనగల్లు, జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలంలోని ఆయా గ్రామాలభివృద్ధికి నిధులు కేటాయించాలని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీను నాయక్ కోరారు. ఈమేరకు మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్పంచుల ఫోరం అధ్వర్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, మంచినీటి సరఫరా, విద్యుత్ దీపాలు తదితర మౌలిక సదుపాయాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి సర్పంచుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్ లు కలసి కట్టుగా పని చేయాలనీ చెప్పారు. నూతన కార్యవర్గం ఐక్యతతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, కడ్తాల్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు జంగమ్మ వెంకటయ్య, మౌనిక శివ, సెక్రటరీ వెంకటయ్య, కోశాధికారి శానమోని సత్యం, సభ్యులు ప్రశాంతి రవికుమార్, రాజేశ్వరి మల్లేష్ నాయక్, పత్య నాయక్, ఉప సర్పంచ్ సురేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

# నైరుతి కనుమరుగైందా?!..

**దేశమంతటా విస్తరించినా..**

**వానలు అంతంత మాత్రమే**



**న్యూఢిల్లీ జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సూపర్ ఎల్‌నిలో ఎఫెక్ట్‌తో ఇప్పటికే ఆలస్యమైన 'నైరుతి' ఉన్నట్టుండి కనుమరుగయ్యిందా? దేశమంతటా రుతు పవనాలు విస్తరించినప్పటికీ, వానలు లేకపోవడానికి కారణమేంటీ? భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం విడుదల చేసిన తాజా ఉపగ్రహ చిత్రాలు ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాయి. City & Local Guides దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు ఇప్పటికే విస్తరించిన నైరుతి రుతుపవనాలు.. ఉపగ్రహ చిత్రాల్లో ఉన్నట్టుండి కనుమరుగయ్యినట్టు ఐఎండీ పేర్కొంది. ఈ కారణంగానే ఈ నెల 4వ తేదీ నుంచి సోమవారం వరకూ దేశవ్యాప్తంగా సగటున 53.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైనట్టు వెల్లడించింది. లోటువర్షపాతం 64 శాతంగా రికార్డయ్యినట్టు వివరించింది.

**ఎందుకు ఇలా?**

దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ, సమృద్ధిగా వానలు లేకపోవడానికి తూర్పు-పశ్చిమ పవనాలు ఢీకొనడమే కారణమని ఐఎండీ తెలిపింది. తూర్పు నుంచి వచ్చే పవనాలు (ఈస్టర్లీ జెట్) మేఘాలను తాకడం వల్ల నైరుతి సమయంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. భూ ఉపరితలానికి 15 కిలోమీటర్ల ఎత్తులో ఈ ప్రక్రియ జరుగుతుంది. అయితే, ఉన్నట్టుండి పశ్చిమం దిశ నుంచి అత్యంత వేగంగా వచ్చిన పవనాలు (వెస్టర్లీ జెట్ స్ట్రీమ్) ఈస్టర్లీ జెట్‌ను ఢీకొట్టడంతో మేఘాలు ఏర్పడటం ఆగిపోయిందని, ఈ కారణంగానే సరైన వానలు పడట్లేదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

**వారంలో సర్దుబాటు**

నైరుతి ప్రవేశించి పది రోజులు గడుస్తున్నప్పటికీ, దేశంలో సగం కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఇంకా లోటు వర్షపాతమే నమోదైనట్టు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నైరుతిలో ఈ స్తబ్దత మరో వారం పాటు కొనసాగే అవకాశం ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. పరిస్థితుల్లో మార్పులు జరిగి 22వ తేదీ నాటికి వానలు సాధారణ స్థితికి చేరవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆస్ట్రేలియాకు చెందిన తొమ్మిదేళ్ల బాలికను కాల్చి చంపిన పాక్ పోలీసులు



**న్యూఢిల్లీ జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌లో పోలీసు అధికారి పొరపాటున జరిపిన కాల్పుల్లో ఆస్ట్రేలియాకు చెందిన 9 ఏళ్ల బాలిక హానియా మృతిచెందింది. దొంగతనం కేసులో అనుమానితులను వెంబడిస్తున్న క్రమంలో, పారిపోతున్న కుటుంబ వాహనాన్ని అడ్డగించే ప్రయత్నంలో అధికారి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో బాలికతో పాటు ఆమె తండ్రి, సోదరుడు గాయపడ్డారు. ఆస్ట్రేలియా ప్రధాని విచారం వ్యక్తం చేస్తూ, పారదర్శక విచారణకు ఆదేశించారు. గాయపడిన వారికి ఆస్ట్రేలియా కాన్సులేట్ సహాయం అందిస్తోంది.

# అణ్వాయుధాలు వదులుకునేందుకు ఇరాన్ అంగీకరించింది:



**న్యూయార్క్ జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. అయితే అణ్వాయుధాలను కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించినట్లు సోమవారం డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇక తమ శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు 300 మిలియన్ల డాలర్ల ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో స్పందించారు. ఇరాన్‌తో కుదిరే డీల్‌లో.. అణ్వస్త్రాలను డెవలప్ చేయబోమని ఆ దేశం అంగీకరించనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య ఎంవోయూ కుదిరినట్లు వార్తలు వెలుబడుతున్న విషయం తెలిసిందే. జెనీవాలో శుక్రవారం అధికారికంగా రెండు దేశాల మధ్య సంతకాలు జరిగే అవకాశం ఉన్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి రోజు నుంచి స్పష్టంగా ఉన్నారని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండబోదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అణ్వాయుధ సేకరణ కోసం ఇరాన్‌కు అనుమతి ఇవ్వబోమని ఇజ్రాయల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కూడా స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండవద్దు అని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానని, దీన్ని జీవిత మిషన్‌గా భావించానని అన్నారు. డీల్ కుదిరినా, కుదరకపోయినా, ఇరాన్ వద్ద న్యూక్లియర్ వెపన్ ఉండబోదన్నారు. ఇజ్రాయెల్ ప్రధానిగా తాను ఉన్నంత కాలం ఇలా జరగబోదన్నారు.

# డిజిటల్ మోసాలు రెట్టింపు..!

**ప్రపంచ సగటుతో పోల్చితే**

**భారత్ లో ఆందోళనకరం**


**ట్రాన్స్ యూనియన్ వెల్లడి**




**న్యూఢిల్లీ జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేశంలో డిజిటల్ లావాదేవీలు ఏటా రికార్డు స్థాయిలో విస్తరిస్తున్నప్పటికీ అదే వేగంతో సైబర్ నేరగాళ్లు కూడా విరుచుకుపడుతున్నారు. అంతర్జాతీయ క్రెడిట్ బ్యూరో సంస్థ ట్రాన్స్‌యూనియన్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో డిజిటల్ మోసాల ముప్పు దాదాపు రెట్టింపు స్థాయిలో పొంచి ఉంది. గడిచిన ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన డిజిటల్ లావాదేవీలలో అనుమానాస్పద మోసాల సగటు 3.8 శాతంగా నమోదైతే.. భారత్‌లో ఈ రేటు ఏకంగా 7.1 శాతానికి చేరి ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వేగవంతమైన వృద్ధిని కనబరుస్తున్న లాజిస్టిక్స్, టెలికాం, మరియు ఇన్సూరెన్స్ రంగాలు ఈ సైబర్ మోసగాళ్ల ప్రధాన లక్ష్యంగా మారుతు న్నాయి. ?పరిశ్రమల వారీగా ఈ డేటాను పరిశీలిస్తే.. కొరియర్, రవాణా సేవలు అందించే లాజిస్టిక్స్ రంగం 16.3 శాతం అనుమానాస్పద మోసాల రేటుతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో టెలికాం రంగం 14.7 శాతంతో, బీమా రంగం 11.5 శాతంతో తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ నిర్దిష్ట రంగాలు వెంటవెంటనే జరిగే లావాదేవీలపై, విస్తృతమైన డిస్ట్రిబ్యూటెడ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడి పనిచేస్తుండటమే సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోంది. వినియోగదారుల గుర్తింపును సరిచూసే ప్రక్రియల్లో, అథెంటికేషన్ వ్యవస్థల్లో ఉన్న సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు ఈ రంగాల ఖాతాల్లోకి సులభంగా చొరబడుతున్నారు. ?అయితే అంతర్జాతీయ ట్రెండ్‌తో పోలిస్తే భారత్‌లో సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న వ్యూహం పూర్తి భిన్నంగా ఉందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా కొత్త అకౌంట్లు తెరిచేటప్పుడు మోసాలు ఎక్కువగా జరుగుతుంటే.. భారత్‌లో మాత్రం ఇప్పటికే చలామణిలో ఉన్న వినియోగదారుల ఖాతాల్లోకి లాగిన్ అయ్యే సమయంలోనే గరిష్టంగా 3.9 శాతం మోసాలు జరుగుతున్నాయి. వ్యాపార సంస్థలు, వినియోగదారులు లాగిన్ దశల్లో తమ భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూశాకే షాపింగ్..

**- జెన్‌జీ అలవాట్లపై సంచలన నివేదిక**



**న్యూఢిల్లీ జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఒకప్పుడు కొత్త దుస్తులు, బ్యూటీ ప్రొడక్ట్‌లు, ఫ్యాషన్ బ్రాండ్ల గురించి తెలుసుకోవాలంటే స్నేహితులు, కుటుంబసభ్యులను అడిగేవారు. లేదంటే ప్రకటనలను చూసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా జెన్‌జీ యువత ఏ వస్తువును కొనుగోలు చేయాలన్నా ముందుగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌నే చూస్తున్నారు. సోషల్‌మీడియాలో పోస్టులను చూసిన తర్వాతనే ఏ ప్రొడక్ట్ అయినా కొనాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటున్నట్లుగా తాజా అధ్యయనంలో వెల్లడైంది. సోషల్ మీడియా దిగ్గజం మెటా నిర్వహించిన తాజా పరిశోధన ప్రకారం.. దేశంలోని 23 నగరాల్లో 4 వేల మందికిపైగా వినియోగదారులపై ఈ అధ్యయనం నిర్వహించారు. ఫలితాల్లో బ్యూటీ, ఫ్యాషన్‌కు సంబంధించి వీడియోలకు అత్యధిక రెస్పాన్స్ వస్తున్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో అత్యధికంగా బ్యూటీ, మేకప్, ఫ్యాషన్, ఫిట్‌నెస్‌కు సంబంధించిన కంటెంట్‌నే ఎక్కువగా చూస్తున్నారని తెలిసింది. ఈ అధ్యయనం ప్రకారం సుమారు 52 శాతం మంది వినియోగదారులు బ్యూటీ, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్‌కు సంబంధించిన రీల్స్‌ను తరచచూ చూస్తున్నామని తెలిపారు. ఇన్‌ఫ్ల్యూయెన్సర్లు బ్రాండ్ ఉత్పత్తులపై రివ్యూలు ఇవ్వడం, కొత్త బ్రాండ్లను పరిచయం చేయడం, వారి అనుభవాలను పంచుకోవడం వంటి అంశాలు ప్రేక్షకులను ఎక్కువగా ఆకర్షిస్తున్నట్లు నివేదికలో తెలిసింది. ఈ అధ్యయనంలో మరో ఆసక్తికర అంశం కూడా వెలుగులోకి వచ్చింది. రీల్స్ వీక్షణలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసం గణనీయంగా తగ్గిపోయినట్లు పరిశోధకులు గుర్తించారు. పట్టణ ప్రాంతాల్లో 98 శాతం మంది వినియోగదారులు ప్రతిరోజూ వీడియోలు చూస్తుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 94 శాతంగా నమోదైంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. గ్రామీణ ప్రాంతాల వినియోగదారులు కూడా పట్టణ ప్రాంతాలవారు ఇష్టపడే అదే తరహా కంటెంట్‌ను వీక్షిస్తున్నారు. అంటే డిజిటల్ వినియోగంలో నగరాలు, గ్రామాల మధ్య ఉన్న అంతరం క్రమంగా తగ్గుతున్నట్లు స్పష్టమవుతుంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను కేవలం వినోదంగా భావించినప్పటికీ.. అవి యూజర్ల కొనుగోలు అలవాట్లను కూడా ప్రభావితం చేస్తున్నాయి. కొత్త ఉత్పత్తి లేదా బ్రాండ్ గురించి తెలుసుకోవడానికి చాలామంది ముందుగా రీల్స్‌ను ఆశ్రయిస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. అధ్యయనం ప్రకారం.. 81 శాతం మంది యూజర్లు కొత్త ఉత్పత్తి లేదా బ్రాండ్ గురించి తొలిసారిగా రీల్స్ ద్వారానే తెలుసుకున్నట్లు తెలిపారు. అలాగే 66 శాతం మంది ఏ వస్తువునైనా కొనే ముందు రీల్స్‌లో అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇక 47 శాతం మంది తుది కొనుగోలు నిర్ణయంపై కూడా రీల్స్ ప్రత్యక్ష ప్రభావం చూపినట్లు అంగీకరించారు.

# డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే దగ్గు సిరప్‌లు..

**కేంద్రం కఠిన ఆదేశాలు**



**న్యూఢిల్లీ: జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దగ్గు సిరప్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని కేంద్రం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో నోటీఫికేషన్ జారీ చేసింది. 1945 నాటి డ్రగ్ రూల్స్ లోనూ సవరణలు చేశారు. తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి సుమారు 20 మంది చిన్నారులు మృతిచెందారు. అయితే ఆ ఘటన పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ తయారీకి చెందిన దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో తన హెచ్చరికల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. 2026 డ్రగ్స్ రూల్స్‌ను కేంద్రం నోటిఫై చేసింది. పాత చట్టానికి సవరణలు చేశారు. షెడ్యూల్ కేలో భాగంగా సిరప్ పదాన్ని ఆ కేటగిరీ నుంచి తొలగించారు. డ్రగ్స్ యాక్ట్ 1940 ప్రకారం ఆ కేటగిరీలో కొన్ని మందుల తయారీ, సరఫరా, అమ్మకాలపై నిషేధం మినహాయింపు ఇస్తారు. షెడ్యూల్ కేలో ఉన్న డ్రగ్స్‌ను ఎటువంటి లైసెన్సు లేకుండానే అమ్ముకోవచ్చు. ఇంటి చిట్కాలుగా భావిస్తూ ఆస్పరిన్, పారాసిటమాల్, అనల్జసిక్ బామ్స్ లాంటి కొన్ని మందులు అమ్ముకునేందుకు వీలు ఉంది. అయితే ఇప్పుడు ఆ షెడ్యూల్ నుంచి సిరప్ అనే పదాన్ని తొలగించారు. దగ్గు కోసం వాడే సిరప్‌లు, లాజెంజిస్, పిల్స్, ట్యాబ్‌లెట్లు కూడా అందులో ఉన్నాయి. ప్రభుత్వం అధికారిక గెజిట్ ప్రచురించడం వల్ల కొత్తగా చేపట్టిన సవరణ అమలులోకి వచ్చేస్తుంది.

# ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి నలుగురు సైనికులకు గాయాలు..

**-సాధారణ తనిఖీ నిర్వహిస్తుండగా పేలుడు**



**న్యూఢిల్లీ జూన్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జమ్మూ కాశ్మీర్‌లో విషాదం జరిగింది. సాధారణ గస్తీ, తనిఖీ నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి నలుగురు సైనికులు గాయపడ్డారు. ఈ ఘటన జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరి జిల్లా, నౌషేరా సెక్టార్ పరిధిలో మంగళవారం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమావోన్ రెజిమెంట్ యూనిట్‌కు చెందిన సైనికులు సాధారణ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక మల్టీ మోడ్ గ్రెనేడ్ ప్రమాదవశాత్తు పేలిపోయింది. ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న నలుగురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురు సైనికులతోపాటు ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో) కూడా ఉన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఉన్నతాధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డవారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స కొనసాగుతోంది. వారి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. వారంలో ఇది రెండో ఘటన. సాధారణంగా ఆర్మీ సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో గస్తీ, నిఘా నిర్వహిస్తుంటారు. నిరంతరం సరిహద్దులో ఈ తరహా తనిఖీలు అక్కడ మామూలే. పైగా రాజౌరి జిల్లాలోని ఘటన జరిగిన ప్రాంతం చాలా సున్నితం కావడంతో కొన్ని ఆయుధాలతో తనిఖీ చేస్తుండగా పేలుడు సంభవించింది. కొన్నిసార్లు ప్రమాదవశాత్తు ఆయుధాలు పేలు సైనికులు మరణించిన ఘటనలు జరుగుతున్నాయి. గత వారం కూడా బారాముల్లా జిల్లాలోని యురి సెక్టార్‌లో ప్రమాదవశాత్తు ఒక గ్రెనేడ్ పేలింది. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిచగా, అప్పటికే సైనికులు మరణించినట్లు వైద్యులు తెలిపారు.